సాక్షి ఖమ్మం

బుధవారం ॥ 11 ॥ జనవరి ॥ 2023



వైద్యం వికటించి మహిళ మృతి

జిల్లా పెద్దాస్పత్రిలో చికిత్స వికటించి మహిళ మృతి చెందగా.. ఆమె బంధువులు ఆందో ళనకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. 8లో



అంగన్‌వాడీల్లో నియామకాలు

అంగన్‌వాడీల్లో ఖాళీగా ఉన్న టీచర్లు, హెల్పర్ పోస్టుల నియామకానికి ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 14°

వాతావరణం

బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. ఉదయం, సాయంత్రం చలి ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కంటి వెలుగుకు చకచకా ఏర్పాట్లు



ఆటో రిఫ్రాక్టో మీటర్లను సెంటర్లకు పంపిస్తున్న సిబ్బంది

ఖమ్మం వైద్యవిభాగం: కంటి వెలుగు రెండోదశ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ యంత్రాంగం శ్రమిస్తోంది. ఈనెల 18వ తేదీన కార్యక్రమాన్ని ఖమ్మంలోనే సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. దీంతో ఇప్పటికే సిబ్బందిని నియమించి శిక్షణ ఇస్తుండగా, అవసరమైనా వాహనాల సేకరణకు టెండర్లు ఆహ్వానించారు. రెండు రోజుల్లో వాహనాలు అందుబాటులోకి రానుండగా, కంటిపరీక్షల కోసం వినియోగించే ఆటో రిఫ్రాక్టో మీటర్ల సేకరణపై దృష్టి సారించారు. ఇప్పటికే జిల్లాలో ఉన్న సామగ్రిని హైదరాబాద్ పంపించగా మరమ్మతుల అనంతరం జిల్లాకు మంగళవారం చేరుకున్నాయి. వీటిని డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుండి అవసరమైన సెంటర్లకు వాహనాల్లో పంపించారు. దీనికి తోడు అవగాహన కరపత్రాలు, ఇతర సామగ్రిని ఇప్పటికే సెంటర్లకు చేరవేసి క్యాంపుల నిర్వహణ ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు.

ఉచిత వృత్తి శిక్షణకు దరఖాస్తులు

ఖమ్మంమయూరిసెంటర్: మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ముస్లింలకు ఉచిత వృత్తి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఎం.ఏ.మహమూది తెలిపారు. కంప్యూటర్ హార్డ్‌వేర్, నెట్‌వర్కింగ్, ఫ్రంట్ ఆఫీసు అసోసియేట్ కోర్సుల్లో మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన గ్రామీణ ప్రాంత ముస్లిం మైనార్టీ అభ్యర్థులు ఈనెల 20వ తేదీలోపు ఖమ్మంలోని పాత మున్సిపాలిటీ భవనంలో ఉన్న తమ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని సూచించారు.

లోక్‌సభ బీజేపీ ప్రభారిగా రమేష్

- కన్వీనర్, జాయింట్ కన్వీనర్ల నియామకం

ఖమ్మంమామిళ్లగూడెం: ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ ప్రభారి, కన్వీనర్, జాయింట్ కన్వీనర్లను నియమించారు. ఈమేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభారిగా కడగంచి రమేష్, కన్వీనర్‌గా నంబూరు రామలింగేశ్వరరావు, జాయింట్ కన్వీనర్‌గా నిరంజన్‌రావును నియమించినట్లు తెలిపారు.

ఆయకట్టుకు ఇబ్బంది లేకుండా సాగర్ జలాలు

ఖమ్మంఅర్బన్: సాగర్ ఆయకట్టు పరిధిలో నీటి ఎద్దడి ఎదురుకాకుండా నీరు అందించేలా తగిన చర్యలు తీసుకోవాలని జల వనరుల శాఖ ఎస్ఈ నర్సింగరావు సూచించారు. ఖమ్మంలో మంగళవారం ఇంజనీర్లతో సమావేశమైన ఆయన పలు సూచనలు చేశారు. తొలుత నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం గత నెల 15 నుండి ఈనెల 7వ తేదీ వరకు మొదటి తడిగా నీరు సరఫరా చేయాల్సి ఉంది. అయితే, ఈనెల 1న కొణిజర్ల మండలం గుబ్బగుర్తి వద్ద యూటీకి బుంగ పడటంతో దిగువకు నీటి సరఫరా నిలిపివేశారు. ఈనేపథ్యాన కల్లూరు, సత్తుపల్లి, మధిర ప్రాంతాలకు ఆఫ్ పీరియడ్ అయినప్పటికీ మంగళవారం నుండి 1,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినందున పర్యవేక్షించాలని తెలిపారు. ఆతర్వాత గత షెడ్యూల్ ప్రకారమే నీటి విడుదల ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో ఈఈలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అదే స్వరం.. అదే ఆవేదన



తోగ్గూడెంలో శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులను సన్మానిస్తున్న అనుచరులు

- 'మణుగూరు' భేటీలో పొంగులేటి ఘాటు వ్యాఖ్యలు
- పార్టీ పెద్దలపై నేరుగా మాజీ ఎంపీ విమర్శలు
- కేసీఆర్, కేటీఆర్ ఫొటోలు లేని ఫ్లెక్సీలతో ఆత్మీయ సమ్మేళనం
- సంక్రాంతి తర్వాత మిగతా నియోజకవర్గాల్లో భేటీలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన ఆవేదన వెలిబుచ్చే క్రమంలో స్వరం మరింత పెంచారు. ఈనెల 1వ తేదీన పార్టీపై సుతిమెత్తగా వ్యాఖ్యలు చేయగా.. మణుగూరులో మంగళవారం నిర్వహించిన పినపాక నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం వేదికగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఏకంగా పార్టీ పెద్దలపై విమర్శలు ఎక్కుపెట్టారు. గత నాలుగున్నరేళ్లలో తన రాజకీయ ప్రస్థానాన్ని ఈ వేదిక సాక్షిగా నెమరువేసుకున్నారు. పొంగులేటి ఏ కార్యక్రమం చేసినా ఒక వైపు సీఎం కేసీఆర్, మరోవైపు మంత్రి కేటీఆర్ ఫొటోలు ఫ్లెక్సీల్లో ఉండేవి. అయితే మణుగూరు మండలం తోగ్గూడెంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనం ఫ్లెక్సీలో వీరి ఫొటోలు లేకపోవడం గమనార్హం. ఇది ఉమ్మడి జిల్లాలో రాజకీయంగా ఆయన అడుగులపై చర్చకు దారితీసింది.

నమ్మకంతో చేరినా.. అవమానాలు

ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌పై నమ్మకంతో తాను తన అనుచరులతో కలిసి పార్టీలో చేరానని నాటి రాజకీయాన్ని పొంగులేటి ఆత్మీయ సమ్మేళనంలో గుర్తు చేసుకున్నారు. అయితే ఉమ్మడి జిల్లాలో రాజకీయంగా అనేక అవమానాలు ఎదుర్కొన్నానని, పలు రకాలుగా తనపై కక్ష పూరితంగా వ్యవహరించారని ప్రస్తావించారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు వెళ్తే నియోజకవర్గంలో ఏం పని అంటూ తనపై కామెంట్లు చేశారని, ఇకపై ఇలాంటివేమీ పట్టించుకోకుండా ప్రజాక్షేత్రంలో ఉంటానంటూ తన మనుసులోని మాటను స్పష్టం చేశారు. అంతేకాకుండా పార్టీ అగ్రనేతలు, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులపై ఘాటుగా పరోక్ష వ్యాఖ్యలు చేశారు. గన్‌మెన్లను వెనక్కి తీసుకున్నా ఇబ్బంది లేదని, తనకు గన్‌మెన్ల అవసరం కూడా లేదని చెప్పారు. తనను ఒక్కడినే చేసి గద్దల్లా దాడికి సన్నద్ధమయ్యారని.. శీనన్న ఒక్కడు కాదనే విషయం ప్రజాక్షేత్రంలోనే తెలుస్తుందంటూ వ్యాఖ్యానించారు.

పండుగ తర్వాత మిగిలిన భేటీలు

పినపాక నియోజవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనం తోగ్గూడెంలో మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన జరిగింది. ఈ సమావేశానికి నియోజకవర్గవ్యాప్తంగా పొంగులేటి అనుచర నేతలు హాజరయ్యారు. ఇక ఉమ్మడి జిల్లాలోని మిగిలిన తొమ్మిది నియోజకవర్గాల ఆత్మీయ సమ్మేళనాలు ఈనెల 15న సంక్రాంతి తర్వాత నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. ముందుగా అశ్వారావుపేట, ఆ తర్వాత భద్రాచలం, సత్తుపల్లితో పాటు మిగిలిన అన్ని నియోజకవర్గాల్లో వరుసగా భేటీలు ఉంటాయని తెలిసింది.

పొంగులేటి, అనుచరుల ఫొటోలే..

ఉమ్మడి జిల్లాలో పొంగులేటి ఏ కార్యక్రమం చేపట్టినా ఫ్లెక్సీల్లో, పర్యటన షెడ్యూల్ ప్రకటనల్లో ఓ వైపు సీఎం కేసీఆర్, మరో వైపు మంత్రి కేటీఆర్ ఫొటోలు ఉండడం ఆనవాయితీ. నూతన సంవత్సరం వేడుకల ఫ్లెక్సీల్లోనూ ఇలాగే జరిగింది. కానీ తోగ్గూడెంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో వీరి ఫొటోలు బ్యానర్‌పై లేకపోగా... పొంగులేటితో పాటు పాయం, ముఖ్య అనుచరుల ఫొటోలు మాత్రమే కనిపించాయి.

పది రోజుల్లోనే తారాస్థాయికి..

పొంగులేటి వ్యాఖ్యల స్వరం రోజురోజుకు పెరుగుతూ వస్తోంది. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా 'బీఆర్ఎస్‌లో గత నాలుగున్నర ఏళ్లల్లో తనకు జరిగిందేమిటి, భవిష్యత్‌లో జరగాల్సిందేమిటో మీకు తెలియనిది కాదు' అని కేడర్‌ను ఉద్దేశించి అన్నారు. ఆతర్వాత పది రోజుల్లోనే ఆయన స్వరం మరింత పెరగడం గమనార్హం. బీఆర్ఎస్ తొలి సభను ఖమ్మంలో నిర్వహణకు నిర్ణయించగా.. సీఎం కేసీఆర్ ప్రగతిభవన్‌లో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంలో పొంగులేటి విషయం ప్రస్తావనకు వచ్చిందని, సీఎం కూడా ఆయనకు ప్రాధాన్యత ఇవ్వనట్లుగా మాట్లాడారనే ప్రచారం జరిగింది. దీనికి తోడు ఉమ్మడి జిల్లా అధికార పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు చేసిన పరోక్ష వ్యాఖ్యలు కూడా తోగ్గూడెం సమావేశంలో పొంగులేటి స్వరం పెరగడానికి కారణమనే చర్చ జరుగుతోంది.

ఏర్పాట్లలో ఏ లోపం ఉండొద్దు..

- ప్రారంభం నాటికి పచ్చదనం ఉట్టిపడాలి
- కలెక్టరేట్ పనుల పరిశీలనలో కలెక్టర్ గౌతమ్

రఘునాథపాలెం: 'సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని ప్రారంభించేందుకు వారం మాత్రమే సమయం ఉంది.. ఆ నాటికి పనులన్నీ పూర్తిచేసి ఏర్పాట్లలో ఏ లోపం లేకుండా చూడాలి' అని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అధికారులను ఆదేశించారు. రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంలో నిర్మిస్తున్న నూతన కలెక్టరేట్‌లో ప్లాంటేషన్ పురోగతి, ఫర్నీచర్ ఏర్పాట్లు, సివిల్, ఎలక్ట్రికల్ పనులను మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. ప్రారంభ సమయానికి కలెక్టరేట్ ఆవరణ పచ్చదనంతో కళకళలాడేలా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఫర్నీచర్ ఏర్పాటు పనులు వేగవంతం చేయాలన్నారు. ఇంకా సివిల్, ఎలక్ట్రికల్ మిగులు పనులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సముదాయం చుట్టూ కలియదిరిగి పనులు పరిశీలించారు. సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎన్.మధుసూదన్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్ రాధిక గుప్తా, డీఆర్వో శిరీష, డీఆర్డీఓ విద్యాచందన, ఆర్ అండ్ బీ ఈఈ శ్యాంప్రసాద్, పీఆర్ ఈఈ కే.వీ.కే.ప్రసాద్, మిషన్ భగీరథ ఈఈ పుష్పలత, డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మాలతి, సీపీఓ శ్రీనివాస్, కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి, ఈఈ కృష్ణలాల్, జిల్లా ఉద్యానవన అధికారి అనసూయ తదితరులు పాల్గొన్నారు.

భద్రతా ఏర్పాట్లపై సీపీ పరిశీలన

సీఎం కేసీఆర్ ఈనెల 18న జిల్లా పర్యటన సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ తెలిపారు.



కలెక్టరేట్‌లో పనులపై ఆరా తీస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ తదితరులు



కలెక్టరేట్‌లో మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీపీ విష్ణు వారియర్

వీ.వీ.పాలెంలోని నూతన కలెక్టరేట్‌తో పాటు బీఆర్ఎస్ సభ నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను మంగళవారం సీపీ పరిశీలించారు. కలెక్టరేట్ భవనం, హెలీప్యాడ్ స్థలం, బహిరంగ సభావేదిక, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించాక ఆయన మ్యాప్ ద్వారా వివరాలు ఆరా తీశారు. బహిరంగ సభకు సీఎం కేసీఆర్ సహా ఇతర రాష్ట్రాలు ముఖ్యమంత్రులు, జాతీయ నాయకులు హాజరుకానుండడంతో పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బందోబస్తుపై పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేసిన సీపీ, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పార్కింగ్ పాయింట్లపై సూచనలు చేశారు. కలెక్టరేట్ ప్రారంభం తర్వాత సీఎంలు సభావేదిక వద్దకు వెళ్లే మార్గం, వీఐపీలు, కార్యకర్తలు వచ్చి వెళ్లే మార్గాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అడిషనల్ డీసీపీలు సుభాష్‌చంద్రబోస్, కుమారస్వామి, ఏసీపీలు బస్వారెడ్డి, ప్రసన్నకుమార్, వెంకటేష్, రెహమాన్, రవి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఆధ్వర్యాన పోటీలు

ఖమ్మంగాంధీచౌక్: టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యాన వచ్చేనెల 1న విష్ణు సహస్ర నామాలు, అచ్యుతాష్టకం పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ కర్నాటి రామకృష్ణారెడ్డి తెలిపారు. పదిహేనేళ్ల లోపు విద్యార్థులకు విష్ణు సహస్ర నామాలు, పదేళ్ల లోపు వారికి అచ్యుతాష్టకం పోటీలు ఉంటాయన్నారు. వివరాలకు 63005 38706 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

12న 'యువశక్తి' పోటీలు

ఖమ్మంస్పోర్ట్స్: జాతీయ యువజనోత్సవం సందర్భంగా ఈనెల 12న ఖమ్మంలోని పటేల్ స్టేడియాలో యువశక్తి పోటీలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి తెలిపారు. జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యాన 15 నుండి 29 ఏళ్ల లోపు యువకులకు వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఉదయం 8.30 గంటలకు హాజరు కావాలని సూచించారు.

విజిబుల్ పోలీసింగ్‌తో నేరాల నియంత్రణ

- రాత్రి వేళ గస్తీ మరింత ముమ్మరం
- నేర సమీక్షలో సీపీ విష్ణు ఎస్.వారియర్

ఖమ్మంక్రైం: విజిబుల్ పోలీసింగ్ ద్వారా నేరాలను నియంత్రించాలని పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ ఆదేశించారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం జరిగిన నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణ ఎంత ముఖ్యమో నేరాలు జరగకుండా చూడడానికి కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రెండు నెలలుగా వివిధ బందోబస్తు విధుల్లో బిజీగా ఉన్న పోలీసులు ఇకపై ప్రతిరోజు నగరంలోని రద్దీ ప్రాంతాల్లో విజిబుల్ పోలీసింగ్‌తో పాటు నిరంతరం తనిఖీలు చేపట్టాలని, పాత నేరస్తులపై కదలికలపై నిఘా వేయాలని సూచించారు. అలాగే, ప్రతిచోట వారానికోసారి కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రామ్ ద్వారా తనిఖీలు చేపట్టాలని తెలిపారు. స్మగ్లింగ్‌ను నిరోధించడానికి జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు లాడ్జీల్లో విస్తృత తనిఖీలు చేపట్టడమే కాక ఈవ్‌టీజింగ్, అర్ధరాత్రి రోడ్లపై మద్యం మత్తులో తిరిగే వారికి చెక్ పెట్టడంపై దృష్టి సారించాలని సీపీ ఆదేశించారు. ఇక నేర నిరూపణలో కీలక పాత్ర పోషించే దర్యాప్తు అధికారులు స్పష్టమైన ప్రణాళికతోపాటు మరింత నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. నగర శివారు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తే అసాంఘిక కార్యకలాపాలు అడ్డుకట్ట వేయొచ్చని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీలు సుభాష్ చంద్రబోస్, కుమారస్వామి, ఏసీపీలు ఆంజనేయులు, బస్వారెడ్డి, వెంకటేష్, రెహమాన్, రవి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ వారియర్, పక్కన అధికారులు

కోరం కనకయ్యకు బుజ్జగింపులు!

మానుకోటలో మంత్రి సత్యవతి, ఎంపీ కవిత మంతనాలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ చైర్మన్, మాజీ ఎంపీ పొంగులేటి అనుచరుడు కోరం కనకయ్యను బీఆర్ఎస్ నేతలు బుజ్జగిస్తున్నట్లు సమాచారం. మహబూబాబాద్‌లో మంగళవారం మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ కవిత ఆయనతో చర్చించినట్లు తెలిసింది. ఇప్పటి వరకు పార్టీ కల్పించిన అవకాశాలను దృష్టిలో ఉంచుకుని పార్టీ మారొద్దని సూచించినట్లు సమాచారం. 2014లో ఇల్లెందు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా కోరం కనకయ్య విజయం సాధించగా.. ఆ తర్వాత కొంత కాలానికి బీఆర్ఎస్‌లో చేరారు. 2018లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసినా కాంగ్రెస్ అభ్యర్థి బానోత్ హరిప్రియ చేతిలో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత ఆమె కూడా బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం చోటు చేసుకున్న పరిణామాల్లో ఆయన టేకులపల్లి బీఆర్ఎస్ జెడ్పీటీసీగా గెలవగా, ఎస్టీలకు రిజర్వ్ అయిన జిల్లా పరిషత్ చైర్మన్ పదవి దక్కింది. కొంతకాలంగా ఆయన రాజకీయంగా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెంట నడుస్తున్నారు. ఈక్రమంలో ఆయనను బుజ్జగించే పనిని మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ కవితకు పార్టీ నాయకత్వం అప్పగించడంతో మహబూబాబాద్ పిలిపించి మాట్లాడినట్లు తెలుస్తోంది.

రాష్ట్రానికి అధిక నిధులు మంజూరు

- జిల్లాలో రూ.8వేల కోట్లతో జాతీయ రహదారుల నిర్మాణం
- కేంద్ర సహకారశాఖ సహాయ మంత్రి బీఎల్.వర్మ

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రంలో అభివృద్ధి పథకాలకు కేంద్రప్రభుత్వం అత్యధికంగా నిధులు మంజూరు చేసిందని కేంద్ర సహకార శాఖ సహాయ, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి బీ.ఎల్.వర్మ వెల్లడించారు. మంగళవారం జిల్లాకు వచ్చిన ఆయన కలెక్టరేట్‌లో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధికి రూ.8,500కోట్లు మంజూరు చేయగా, స్వచ్ఛ భారత్ పథకం కింద చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణాలకు చెల్లింపులు చేశామని తెలిపారు. రూ.3లక్షల్లోపు రుణాలను సహకార సొసైటీల ద్వారా, రూ.5లక్షల రుణాలను నాబార్డు ద్వారా మంజూరు చేయించేలా చొరవ చూపాలని సూచించారు. తొలుత మంత్రి వర్మకు అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. డీఆర్వో శిరీష, డీఆర్డీఓ విద్యాచందన, జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.శ్రీరాం, డీఏఓ విజయనిర్మలతో పాటు వివిధ శాఖల అధికారులు సత్యనారాయణ, అనసూయ, అజయ్‌కుమార్, ఆంజనేయస్వామి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి

ఖమ్మంమామిళ్లగూడెం: డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని కేంద్ర సహకార శాఖ సహాయ, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి బీ.ఎల్.వర్మ అన్నారు. ఖమ్మంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లాక్‌డౌన్ సమయాన కేంద్రం విడుదల చేసిన ఉచిత బియ్యం పంపిణీ కార్యక్రమంలో ప్రధానిమోదీ ఫొటో లేకుండా కేసీఆర్ తన ఫొటో మాత్రమే పెట్టుకున్నారని విమర్శించారు. సామాజిక న్యాయం కేవలం ప్రధాని మోదీతోనే సాధ్యమని చెప్పారు. సబ్‌కా సాత్ - సబ్‌కా వికాస్ నినాదంతో మోదీ ముందుకు పోతున్నారని చెప్పారు.

నేలకొండపల్లి: జిల్లాలో సుమారు రూ.8,500 కోట్ల వ్యయంతో జాతీయ రహదారుల నిర్మాణాలు జరుగుతున్నాయని కేంద్ర మంత్రి బీ.ఎల్.వర్మ తెలిపారు. నేలకొండపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న జాతీయ రహదారుల పనులను మంగళవారం ఆయన పరిశీలించగా, జిల్లా సరిహద్దు పైనంపల్లి వద్ద బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గువ్వలగూడెంలో అండర్ పాస్ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని నేషనల్ హైవేస్ అధికారులను ఆదేశించారు. అనంతరం కేంద్ర మంత్రి విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా చుట్టూ జాతీయ రహదారుల నిర్మాణాలు జరుగుతున్నాయని, గువ్వలగూడెంలో అండర్ పాస్ కోసం స్థానికులు గతంలో విన్నవించగా తాను సిఫారసు చేసినట్లు తెలిపారు.



కలెక్టరేట్‌లో కేంద్ర మంత్రి వర్మకు పుష్పగుచ్ఛం ఇస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్



తల్లాడ : అన్నారుగూడెంలో రేషన్ షాపు వద్ద మోదీ చిత్రపటాన్ని ఆవిష్కరించిన కేంద్రమంత్రి వర్మ

తల్లాడ: తెలంగాణకు తగినన్ని నిధులు కేటాయిస్తున్నా కేంద్రప్రభుత్వంపై సీఎం కేసీఆర్ నిందలు వేస్తున్నారని కేంద్ర మంత్రి బీఎల్.వర్మ అన్నారు. తల్లాడ మండలం అన్నారుగూడెం లో మంగళవారం పర్యటించిన ఆయన రేషన్ షాపులో ప్రధాని మోదీ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. అలాగే, రైతుల నుంచి వినతిపత్రాలు స్వీకరించాక ఆయన మాట్లాడుతూ కేంద్రం ఇస్తున్న నిధులను దారిమళ్లిస్తూ తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఈసమావేశాల్లో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణతో పాటు నాయకులు నున్నా రవికుమార్, చావా కిరణ్, షర్ఫొద్దీన్, మోహీనుద్దీన్, మన్నె కృష్ణారావు, దుర్గారావు, మీగడ గోపి, సూరేపల్లి జ్ఞానరత్నం, భాస్కర్ల వీర్రాజు, నంబూరి రామలింగేశ్వర్‌రావు, మున్నా మిత్రా నాయుడు, ఆపతి వెంకటరామారావు, తేజావత్ బాలాజీనాయక్, దేవకీ వాసుదేవరావు, గాదె కృష్ణారావు, తొండపు మధు, కిన్నెర తిరుమలయ్య, రాంబాబు, నరసింహారావు, శ్రీనివాస్, చంద్రకళ, ప్రసాద్, రాధాకృష్ణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లలో బిజీబిజీ!



డివైడర్ల నడుమ నాటేందుకు తీసుకొస్తున్న మొక్కలు

నూతన కలెక్టరేట్ సముదాయాన్ని ఈనెల 18వ తేదీన సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. అదేరోజు బీఆర్ఎస్ ఆవిర్భావ సభ నిర్వహించాలని నిర్ణయించారు. దీంతో చివరి దశలో ఉన్న కలెక్టరేట్ పనులపై అధికారులు, సభ నిర్వహణకు మైదానాన్ని చదును చేయించడంపై పార్టీ నాయకులు దృష్టి సారించారు. ఇక శ్రీశ్రీ సర్కిల్ నుంచి విజయ కాలేజీ వరకు నిర్మించిన నాలుగు లేన్ల రోడ్డు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ పనులు కూడా ఓ కొలిక్కి వచ్చాయి. ఈమేరకు లైట్లను ఇప్పటికే వెలిగించగా, డివైడర్ల నడుమ మొక్కలు నాటే పనులు కూడా మొదలయ్యాయి. అలాగే, కలెక్టరేట్ ఆవరణలో నిర్మించిన శాశ్వత హెలీప్యాడ్‌కు తోడు మరో హెలీప్యాడ్ తాత్కాలికంగా సిద్ధం చేస్తున్నారు. ఆయా పనులను వివిధ శాఖల అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పర్యవేక్షిస్తున్నారు.

– రఘునాథపాలెం



సభాప్రాంగణాన్ని చదును చేస్తున్న కూలీలు



సభా వేదిక, ప్రాంగణం పనులను పర్యవేక్షిస్తున్న నాయకులు


బెంచీ నాణ్యత బాగుందా..


కుర్చీ గట్టిగానే ఉందా...


బరువు ఆపుతుందా.. లేదా

అంతా సవ్యమేనా ?!

అభివృద్ధి పనైనా.. సంక్షేమ పథకమైనా క్షేత్రస్థాయిలో ఒకటికి, రెండు సార్లు పరిశీలించడం కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌కు అలవాటు! చెరువుల్లో చేపపిల్లల వదిలే సమయాన కూడా అవకతవకలు జరగకుండా ఓసారి పిల్లలన్నింటినీ దగ్గర ఉండి మరీ లెక్కించిన విషయం విదితమే. అదే తరహాలో నూతన కలెక్టరేట్‌ను మంగళవారం పరిశీలించిన కలెక్టర్ తన మార్క్ చూపించారు. కలెక్టరేట్‌లోని వివిధ శాఖల కార్యాలయాలకు అవసరమైన ఫర్నీచర్ చేరుకోగా... నాణ్యతను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. నాణ్యత, సామర్థ్యాన్ని ఆరా తీసిన ఆయన... కూర్చుని మరీ పరిశీలించి ఎక్కడెక్కడ అమర్చాలో అధికారులకు సూచనలు చేశబూరు. – రఘునాథపాలెం

వేలంలో పెరిగిన ఆదాయం


వేలం నిర్వహిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

మధిర: మహాశివరాత్రి తిరునాళ్లను పురస్కరించుకుని మధిరలోని శ్రీ మృత్యుంజయ స్వామి ఆలయ ప్రాంతంలో షాపుల ఏర్పాటు, ప్రసాదాల విక్రయం నిర్వహణను అప్పగించేందుకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. వేలానికి మంచి స్పందన రావడంతో ఆలయానికి ఈ ఏడాది ఆదాయం భారీగా పెరిగింది. గత ఏడాది జాయింట్ వీల్‌తో పాటు ఇతర ఆట వస్తువుల ఏర్పాటుకు రూ.13.85 లక్షలు వేలం పాడగా, ఈసారి చల్లా హేమంత్‌రెడ్డి రూ.20.01లక్షలకు దక్కించుకున్నారు.

దీంతో రూ.6లక్షలకు పైగా ఆదాయం పెరిగినట్లయింది. అలాగే, కొబ్బరికాయల అమ్మకాన్ని మందడపు రామకృష్ణ రూ.60వేలు, లడ్డూ ప్రసాదాల విక్రయాన్ని వేల్పుల శ్రీనివాసరావు రూ.33,333కు దక్కించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ వంకాయలపాటి నాగేశ్వరరావు, దేవాదాయ శాఖ పరిశీలకులు ఆర్.సమత, ఈఓ జగన్మోహన్ రావు, సిబ్బంది రాధ తదితరుల పర్యవేక్షణలో వేలం నిర్వహించారు.

క్లుప్తంగా

సత్తుపల్లిలో మోడ్రన్ దోబీఘాట్


మోడ్రన్ దోబీఘాట్‌లో పరిశీలిస్తున్న చైర్మన్

సత్తుపల్లి: సిరిసిల్ల జిల్లా వెంకంపేటలో ఆధునాతనంగా నిర్మించిన దోబీఘాట్ తరహాలోనే సత్తుపల్లిలో మోడ్రన్ దోబీఘాట్ నిర్మించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ తెలిపారు. సత్తుపల్లికి చెందిన రజకులతో కలిసి వెంకంపేట దోబీఘాట్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే వెంకటవీరయ్య సూచనలతో దోబీఘాట్‌ను నిర్మిస్తుండగా, పరిశీలనకు వెంకటపేట వెళ్లినట్లు ఆయన ఫోన్‌లో తెలిపారు. మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, రజకులు బెల్లంకొండ రాము, శ్రీను, నిమ్మటూరి రామకృష్ణ, రాయల కోటేశ్వర రావు, మరికంటి సత్యనారాయణ, శ్రీనివాస రావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కాంట్రాక్టర్‌పై కేసు

ఖమ్మంక్రైం: బాల కార్మికుడితో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న కాంట్రాక్టర్‌పై కేసు నమోదైంది. కార్మిక శాఖ అధికారి శాస్త్రి మంగళవారం ఖమ్మం కమాన్ బజార్‌లో 17ఏళ్ల బాలుడితో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నట్లు గుర్తించి కాంట్రాక్టర్ కట్టా వెంకటనారాయణపై ఫిర్యాదు చేశారు. దీంతో వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

గృహోపకరణాల పేరిట మోసం

ఖమ్మంరూరల్: తక్కువ ధరకే గృహోపకరణాలు అమ్ముతానని నమ్మించి డబ్బు కాజేసిన ఘటన ఇది. మండలంలోని పోలేపల్లికి చెందిన రిషాబ్ గారీ తనకు కావాల్సిన గృహోపకరణాల కోసం ఓఎల్ఎక్స్‌లో వెతికాడు. అందులో ఓ వ్యక్తి తక్కువ ధరకే సామగ్రి అమ్ముతాననడంతో రూ.94వేలు ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. ఎంతకూ సామగ్రి రాకపోగా, ఫోన్ స్విచాఫ్ వస్తుండడంతో మోసపోయినట్లు గుర్తించి రిషాబ్‌గారీ మంగళవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

రోడ్డును కమ్మేసిన బూడిద


పైపులైన్ లీకై బయటకు వచ్చిన బూడిద

పాల్వంచరూరల్: పాల్వంచ నుంచి పాండురంగాపురం వైపు వెళ్లే మార్గంలోని రహదారిపై బూడిద కమ్మేయడంతో రాకపోకలు కొద్దిసేపు స్తంభించాయి. పాండురంగాపురం నుంచి పాల్వంచ వైపు వచ్చే ప్రధాన రహదారి పక్కన గల కేటీపీఎస్ 5వ దశలో విద్యుత్ ఉత్పత్తికోసం బొగ్గును మండిస్తారు. పైపులైన్‌ద్వారా సైలోకు బూడిదను తరలిస్తారు. అక్కడ వాహనాల్లో బూడిదను లోడుచేసే సైలోకు చెందిన రెండు పైపులైన్‌లు ఉన్నాయి. ఈ రెండు పైప్‌లైన్‌లను కలిపే చోట లీక్ కావడంతో బూడిద మొత్తం పైపులో నుంచి బయటకు వచ్చింది. దీంతో రాకపోకలు కొద్దిసేపు నిలిచిపోయాయి. అప్రమత్తమైన అయిన కేటీపీఎస్ అధికారులు వెంటనే బూడిద లీకేజీని అడ్డుకున్నారు. బూడిద లీక్ కాకుండా మరమ్మతులు చేపడుతామని సీఈ ప్రభాకర్‌రావు తెలిపారు.

చికిత్స పొందుతున్న ఉపాధ్యాయుడు మృతి

టేకులపల్లి: మండలానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, యూటీఎఫ్ సీనియర్ కార్యకర్త మంగళవారం మృతి చెందారు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. తొమ్మిదోమైలుతండా గ్రామానికి చెందిన లాకావత్ తారాసింగ్ (45) మండలంలోని చింతలంక ఎంపీపీఎస్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. కొంతకాలంగా మెదడులో సమస్య కారణంగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో మెదడులో రక్తం గడ్డకట్టి పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి హైదరాబాద్ ఆస్పత్రిలోనే మృతి చెందారు. మృతుడి భార్య కూడా ప్రభుత్వ ఉపాధ్యాయురాలే. యూటీఎఫ్, ఇతర సంఘాల నాయకులు సంతాపం ప్రకటించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,881

అంగన్‌వాడీల్లో నియామకాలు

టీచర్లు, హెల్పర్ల ఎంపికకు మార్గదర్శకాలు జారీ

- ఇంటర్ కనీస విద్యార్హత.. కలెక్టర్ చైర్మన్‌గా కమిటీలు
- జిల్లాలో 196 ఖాళీలు ఉన్నట్లు గుర్తింపు


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

ఖమ్మంగాంధీచౌక్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్ల, మినీ టీచర్ల, హెల్పర్ల పోస్టుల భర్తీకి మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈమేరకు పోస్టుల భర్తీలో అనుసరించాల్సిన విధివిధానాలపై ఉన్నతాధికారులు జిల్లా అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరిస్తూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల ఎంపికలు చేపట్టాలని సూచించారు.

కలెక్టర్ చైర్మన్‌గా ఎంపిక కమిటీలు

అంగన్‌వాడీ టీచర్ల, హెల్పర్ల ఎంపికకు గాను రెండు రకాల కమిటీలు ఏర్పాటుచేయనున్నారు. ఐటీడీఏ పరిధిలో లేని ప్రాంతానికి ఒక కమిటీ, ఐటీడీఏ పరిధిలోని ప్రాంతాలకు ఇంకో కమిటీని ఏర్పాటుచేయనుండగా, రెండింటికి కూడా కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఐటీడీఏ పరిధిలో లేని ప్రాంతంలో చేపట్టే నియామకాల కమిటీలో ఆర్డీఓ, డీఎంహెచ్‌ఓ సభ్యులుగా, జిల్లా సంక్షేమాధికారి కన్వీనర్‌గా ఉంటారు. ఇక ఐటీడీఏ పరిధిలో జరిగే నియామకాల కమిటీలో ఆర్డీఓ, ఐటీడీఏ పీఓ, డీఎంహెచ్‌ఓ సభ్యులుగా, జిల్లా సంక్షేమాధికారి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

నియమ నిబంధనలు ఇవే...

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లుగా స్థానిక మహిళా అభ్యర్థి(రిజర్వేషన్ ప్రకారం) అర్హురాలని వెల్లడించారు. అలాగే, అంగన్‌వాడీ టీచర్లు, మినీ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల కోసం ఇంటర్ విద్యార్హత కలిగి ఉండాలని సూచించారు. హెల్పర్లుగా ఇంటర్ విద్యార్హత కలిగిన వారు లేకపోతే ఎస్సెస్సీ ఉత్తీర్ణత సాధించిన వారికి అవకాశం ఇస్తారు. కాగా, ఇంటర్‌లో మార్కులకు 80మార్కులు, వితంతువులు, దివ్యాంగులకు ఐదేసి మార్కులతో పాటు అనాథలకు పది మార్కులను వెయిటేజీ ఇస్తారు.

జిల్లాలో 196 ఖాళీలు

జిల్లాలోని కల్లూరు, కామేపల్లి, ఖమ్మం రూరల్, ఖమ్మం అర్బన్, మధిర, సత్తుపల్లి, తిరుమలాయపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 1,840 అంగన్ వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో మొత్తంగా 196 టీచర్లు, హెల్పర్ల ఖాళీలు ఉన్నాయి. ఇందులో మెయిన్ అంగన్‌వాడీ టీచర్లు 79 మంది, మినీ అంగన్‌వాడీ టీచర్లు 18మందితో పాటు హెల్పర్లు 99 మందిని నియమించనున్నారు. రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల ఆధారంగా వీటిని భర్తీ చేయనున్నారు. అయితే, జిల్లా స్థాయిలో ఖాళీలను గుర్తించి నోటిఫికేషన్ ఇచ్చాక భర్తీ ప్రక్రియ మొదలవుతుంది.

ప్రభుత్వ ఆదేశాలను అమలు చేస్తాం..



రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆదేశాలను అనుసరిస్తూ అంగన్‌వాడీ టీచర్ల, హెల్పర్ల నియామకాలు చేపడుతాం. ప్రస్తుతం ఉన్నతాధికారులు మార్గదర్శకాలు మాత్రమే విడుదల చేశారు. ఖాళీలు, నోటిఫికేషన్ తదితర అంశాలపై ఉత్తర్వులు అందాల్సి ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రక్రియ నిర్వహిస్తాం.

– సీహెచ్ సంధ్యారాణి, జిల్లా సంక్షేమాధికారి

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



శిక్షణలో మాట్లాడుతున్న సీడీపీఓ కవిత

రఘునాథపాలెం: మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు అందరూ కృషి చేయాలని ఐసీడీఎస్ ఖమ్మం అర్బన్ సీడీపీఓ కవిత సూచించారు. స్థానిక రైతువేదికలో హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన మానవ అక్రమ రవాణా అరికట్టడంపై సిబ్బందికి మంగళవారం శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో కవిత మాట్లాడుతూ ప్రతీ అంగన్‌వాడీ టీచర్ తమ పరిధిలోని అన్ని వర్గాల ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై అవగాహన పెంచుకుని, మానవ అక్రమ రవాణా జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజ్వల సంస్థ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ ఐలరామకృష్ణ మాట్లాడుతూ గత 27ఏళ్లుగా పద్మశ్రీ డాక్టర్ సునీతకృష్ణన్ ఆధ్వర్యాన ప్రభుత్వ శాఖల సహకారంతో మానవ అక్రమ రవాణాపై సంస్థ పోరాడుతోందని తెలిపారు. కోఆర్డినేటర్ సురేష్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పుష్పలత, సత్యవతి, కృష్ణకుమారి, సత్యశీల, కోటేశ్వరమ్మ, శ్రీలక్ష్మి, సునీత, సుధాభవాని తదితరులు పాల్గొన్నారు.

పాలేరు నుంచి పర్ణశాల వరకు అభివృద్ధి చేశా..

కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి


సమావేశంలో మాట్లాడుతున్న రేణుకాచౌదరి

ఖమ్మం సహకారనగర్: తన హయంలో పాలేరు నుంచి పర్ణశాల వరకు అభివృద్ధి చేశానని కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి వెల్లడించారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పార్టీ అగ్రనాయకులు రాజీవ్‌గాంధీ కాలం నుంచి నేటి వరకు కేంద్రమంత్రిగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశానని తెలిపారు. కేంద్రియ విద్యాలయాల మంజూరుతో పాటు పార్కులను, రహదారుల అభివృద్ధికి కృషి చేసినట్లు వెల్లడించారు. కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలు ఖమ్మం వైపు చూస్తున్నాయని... అయితే, ఖమ్మం జిల్లా మాత్రం కాంగ్రెస్ ఖిల్లా అని తెలిపారు. రాష్ట్రంలో మహిళా గవర్నర్‌ను కనీసం గౌరవించుకోలేని పరిస్థితులు తొలగిపోయి, పేదలకు ఉపాధి, పరిశ్రమల ఏర్పాటు, రైతులకు గిట్టుబాటు ధర దక్కాల్సిన అవసరముందని చెప్పారు. రానున్న ఎన్నికలలో పది అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంట్ స్థానాలు గెలిచి తీరుతామని రేణుకాచౌదరి ధీమా వ్యక్తం చేశారు. ఈసమావేశంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో పాటు నాయకులు మానుకొండ రాధాకిషోర్, నాగండ్ల దీపక్‌చౌదరి, ఎడవల్లి కృష్ణ, మద్ది శ్రీనివాసరెడ్డి, రామసహాయం మాధవరెడ్డి, చోటా బాబా, మిక్కిలినేని నరేందర్, చంద్రప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా తొలుత మమత ఆస్పత్రి రోడ్డులో నూతన క్యాంపు కార్యాలయాన్ని రేణుకాచౌదరి ప్రారంభించారు.

ముగ్గురు అంతర్ జిల్లా దొంగల అరెస్ట్

రూ.16 లక్షల సొత్తు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న సొత్తును పరిశీలిస్తున్న సీపీ

ఖమ్మంక్రైం: పలు జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు రెండు కేసుల్లో ముగ్గురిని అరెస్టు చేయగా, వారి నుంచి రూ.16 లక్షల సొత్తు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌లో సీపీ విష్ణు ఎస్.వారియర్ మంగళవారం వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోని న్యూగొల్లగూడెంనకు చెందిన వరికుప్పల వెంకటేష్, లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండరామవరానికి చెందిన నారసాని రమేష్ కలిసి ముదిగొండ మండలం వల్లభిలోని బంగారం షాప్‌లో రూ.10 లక్షల విలువైన ఆభరణాలు చోరీ చేశారు. మొదట రెక్కీ చేశాక వీరు చోరీకి పాల్పడగా, మంగళవారం వీవీ పాలెం వద్ద పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. వారి నుంచి 23 గ్రాముల బంగారం, 12 కేజీల వెండి స్వాధీనం చేసుకున్నారు. ఇక ఖమ్మం శ్రీశ్రీ సర్కిల్‌లో పోలీసులు తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. సదరు వ్యక్తి రంగారెడ్డి జిల్లా చింతల్ భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన మనిగండ్ల విజయ్‌కుమార్‌గా తేలింది. ఆయన ఖానాపురంలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడడమే కాక, గతంలో జీడిమెట్ల, బాలానగర్, సత్తుపల్లి, కొత్తగూడెం, జడ్చర్ల, భువనగిరి జిల్లాల్లోనూ దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించారు. విజయ్ నుంచి 97 గ్రాముల బంగారం, 724 గ్రాముల వెండిని స్వాధీనం చేసుకున్నారు. వారు ముగ్గురు కూడా జల్సాలకు అలవాటు పడి చోరీలు చేస్తున్నట్లు తేలిందని సీపీ వారియర్ వివరించారు.

సెలవులో సబ్ రిజిస్ట్రార్!

– అక్రమ రిజిస్ట్రేషన్‌పై చర్యలకు అవకాశం

వైరా: అనుమతి లేని ఓ వెంచర్‌లో అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన సమాచారంతో వైరా సబ్ రిజిస్ట్రార్‌పై జిల్లా అధికారులు చర్యలు తీసుకునే అవకాశముందనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయం తెలియడంతో సబ్ రిజిస్ట్రార్ సెలవులో వెళ్లినట్లు సమాచారం. వైరా సబ్ రిజిస్ట్రార్ రాంకుమార్ నెల క్రితం కొణిజర్ల రెవెన్యూ పరిధి దిద్దుపూడిలో అనుమతి లేని ఓ వెంచర్‌లో అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారని కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. దీంతో జిల్లా రిజిస్ట్రార్ విచారణ చేపట్టగా, సబ్ రిజిస్ట్రార్ సెలవుపై వెళ్లడం చర్చనీయాంశమైంది. కాగా, తాత్కాలికంగా రిజిస్ట్రార్ బాధ్యతలను కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌కు అప్పగించారు. ఈక్రమంలో రెండు రోజుల్లో ఆయనపై విచారణ పూర్తికానుండగా, చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

108 వాహనంలో ప్రసవం


వాహనంలో జన్మించిన పాపతో సిబ్బంది

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి 108లో గర్భిణీని తీసుకొస్తుండగా వాహనంలోనే ప్రసవించింది. వివరాలు... దానవాగూడెంకు చెందిన పసుపులేటి నాగమణి రెండో సారి గర్భం దాల్చగా మంగళవారం ఉదయం నొప్పులు వచ్చాయి. దీంతో కుటుంబ సభ్యులు పెద్దాస్పత్రిలోని ఎంసీహెచ్‌కు తీసుకురాగా, పరీక్షించిన వైద్యులు డెలివరీకి మూడు రోజుల సమయం ఉందని పంపించారు. ఆమెను ఇంటికి తీసుకెళ్లేలోగా మళ్లీ నొప్పులు రావడంతో 108వాహనంలో పెద్దాస్పత్రికి బయలుదేరారు. అయితే, జెడ్పీ సెంటర్‌కు చేరుకునేలోగా నాగమణికి నొప్పులు ఎక్కువవడంతో వాహనాన్ని పక్కకు ఆపిన సిబ్బంది ఆమెకు ప్రసవం చేశారు. అనంతరం బాలింతతో పాటు శిశువును పెద్దాస్పత్రికి తరలించారు. ఈసందర్భంగా 108 సిబ్బంది తుమ్మ జగదీష్, జి.రమేష్‌ను బాలింత కుటంబీకులు, ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్, ఎమర్జెన్సీ ఎగ్జిక్యూటివ్ బి.రాజేష్ అభినందించారు.

వైద్యం వికటించి మహిళ మృతి


వెంకటలక్ష్మి మృతదేహం

- జిల్లా పెద్దాస్పత్రిలో ఘటన
- ముక్కుకు ఆపరేషన్ నిర్వహిస్తుండగా విషాదం
- వైద్యుడి నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన


ఏసీపీతో మాట్లాడుతున్న నాయకులు, బంధువులు

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా కేంద్రంలోని పెద్దాస్పత్రిలో ఓ మహిళ ముక్కుకు ఆపరేషన్ నిర్వహిస్తుండగా అపస్మారక స్థితిలోకి వెళ్లి మృత్యువాత పడింది. ఈ ఘటనకు వైద్యుడి నిర్లక్ష్యమే కారణమంటూ ఆమె బంధువులు ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. మంగళవారం సాయంత్రం ఈ ఘటన జరగగా, వైద్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని నినదించిన బంధువులు, అంతటితో ఆగకుండా మృతురాలిని ఉంచిన ఐసీయూ అద్దాలు, పూలకుండీలను ధ్వంసం చేశారు. ఈ ఘటనకు సంబంధించి మృతురాలి బంధువుల కథనం ప్రకారం... ఖమ్మం అర్బన్ మండలం పుట్టకోటకు చెందిన వెంకటలక్ష్మి, ముత్తయ్య భార్యాభర్తలు. వెంకటలక్ష్మి(25)కి ముక్కులో గడ్డ ఏర్పడటంతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి రాగా పరీక్షించిన వైద్యులు ఆపరేషన్ చేయాలని సూచించారు. దీంతో ఈనెల 6వ తేదీన ఆస్పత్రిలో చేర్పించగా మంగళవారం ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు. ఈక్రమంలో ఆమె ముక్కుకు ఆపరేషన్ చేస్తుండగా ఒక్కసారిగా అపస్మారక స్థితిలోకి వెళ్లి మృత్యువాత పడింది. అయితే, అంత వరకు బాగానే ఉన్న వెంకటలక్ష్మి మృతి చెందినట్లు తెలుసుకున్న మృతురాలి కుటుంబ సభ్యులు పెద్దసంఖ్యలో చేరుకుని ఆస్పత్రి సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. వీరి స్వగ్రామమైన పుట్టకోటతో పాటు మృతురాలి స్వగ్రామమైన తిరుమలాయపాలెం నుండి పెద్దసంఖ్యలో బంధువులు చేరుకోగా, న్యూడెమెక్రసీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు.

ఆస్పత్రి ఎదుట బైఠాయించి ఆందోళన

మృతురాలి బంధువులు, వివిధ పార్టీల నాయకులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. వైద్యుడు సరిగా పట్టించుకోలేదని, మత్తుమందు ఎక్కువగా ఇవ్వడం వల్లే వెంకటలక్ష్మి మృతి చెందిందని ఆరోపించారు. ఆందోళన ఉధృతం కావటంతో వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, ఖానాపురం హవేలి పోలీస్ స్టేషన్ల సిబ్బంది భారీగా మోహరించారు. అంతే కాకుండా ఖమ్మం ఏసీపీ ఆంజనేయులు చేరుకుని మృతురాలి బంధువులకు నచ్చచెప్పేందుకు యత్నించినా ససేమిరా అన్నారు. చివరకు ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, ఆర్ఎంఓ బి.శ్రీనివాసరావు, ఏసీపీ ఆంజనేయులు, బీఆర్ఎస్ నాయకులు బీరెడ్డి నాగచంద్రారెడ్డి తదితరులు వెంకటలక్ష్మి బంధువులతో చర్చించి కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇవ్వడమే కాక ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పడంతో రాత్రి ఆందోళన విరమించారు.


ధ్వంసమైన ఐసీయూ అద్దాలు

కుటుంబీకుల చెంతకు యువకులు


యువకులకు కుటుంబాలకు అప్పగిస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: మానసిక దివ్యాంగులను చేరదీసిన అన్నం ఫౌండేషన్ బాధ్యులు చికిత్స అందించడంతో కోలుకున్నాక వారి కుటుంబీకులకు అప్పగించారు. గత ఏడాది నవంబర్‌లో మతిస్థిమితం కోల్పోయిన ఇద్దరు యువకులు ఖమ్మంలో ప్రజలను భయభ్రాంతులను గురిచేస్తుండగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఖమ్మం టూ టౌన్ పోలీసులు వారిని అన్నం సేవా ఫౌండేషన్‌లో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స చేయించగా వారు కోలుకోవడంతో వివరాలు ఆరా తీయగా బీహార్‌కు చెందిన నితీష్‌కుమార్, జార్ఖండ్‌కు చెందిన రాకేష్‌సింగ్‌గా వెల్లడించారు. దీంతో వారి కుటుంబీకులకు సమాచారం ఇవ్వగా మంగళవారం రావడంతో టూ టౌన్ పోలీసుల సమక్షాన అప్పగించామని అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు తెలిపారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య

ఖమ్మంక్రైం: నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తులు మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఖమ్మం తుమ్మలగడ్డ ప్రాంతానికి చెందిన బస్వగల్ల రాముగౌడ్ కల్లుకు బానిసై కుటుంబాన్ని పట్టించుకోవడం లేదు. మంగళవారం ఆయన భార్య ఊరికి వెళ్లడంతో ఉరి వేసుకుని ఆతమహత్య పాలడ్డారు. ఇక శుక్రవారిపేటకు చెందిన కూలీ పని చేసే షేక్ రఫీ(40) కుమారుడికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో భార్యతో కలిసి ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అయితే, రక్త పరీక్షలు చేయించాలని సూచించగా డబ్బు లేకపోవడంతో ఇంటికి వచ్చి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటికి వెళ్లిన భర్త ఎంతకూ రాకపోవటంతో భార్య వచ్చి పరిశీలించగా మృతి చెందాడు. ఈ ఘటనలపై ఖమ్మం వన్ టౌన్ పోలీసులు కేసులు నమోదు చేశారు.